

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు 'అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# మనసు మూగది

రాజేష్ డిక్టేషన్ ఇస్తున్నాడు.

అర్చన షార్ట్ హాండ్ లో రాసుకుంటున్నది.

వాళ్ళ ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ సుధీర్ గదిలోకి వచ్చాడు.

రాజేష్ అతన్ని చూడగనే సాదరంగా ఆహ్వానించాడు. " రా...రా..వాటే ప్లెజంట్ సర్ ప్రైజ్..." అంటూ.

సుధీర్ వచ్చి అర్చన పక్కన కూర్చున్నాడు.

"నువ్విక్కడ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా పనిచేస్తున్నావని తెల్సింది. నిన్ను నీ రూం లో చూద్దామని వచ్చాను. గెటప్ అంతా బావుంది. .కంగ్రాట్స్...." అన్నాడు సుధీర్.

రాజేష్ సుధీర్ క్లాస్ మేట్స్. చాలా చనువుగా మాట్లాడుకుంటున్నారు. అర్చన తప్పనిసరిగా వింటూ కూర్చుంది. ఆమె లేచి రాబోయినా, రాజేష్ కూర్చొమనటంతొ అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

రాజేష్ ఆమెను సుధీర్ కు పరిచయం చేశాడు.

రాజేష్ బెల్ల్ కొట్టి అటెండర్ని పిల్చి చెప్పాడు కాఫీ తెమ్మనమని. అటెండర్ వెళ్ళి పొయాడు. మళ్ళీ వాళ్ళు చిన్నప్పటి కబుర్లు చెప్పుకుంటున్నారు. అర్చన లేచి బయటికి రాబోయింది. రాజేష్ ఆమెను కూర్చొమన్నాడు.

సుధీర్ ప్రసంగం అర్చన వైపు మళ్ళింది. ఆమె వివరాలు అడిగాడు. కొన్ని చెప్పింది. కొన్ని చెప్పటం ఇష్టం లేక దాటేసింది.

"మా వాడు పైకి కఠినంగా ఉన్నట్లు కనిపిస్తాడు గానీ మనిషి చాలా మెత్తన. మనసు వెన్నపూస అనుకొండి. ఇట్టే కరిగిపొతాడు. ఈ పాటికి మీకు అర్థం అయ్యే ఉంటుంది. వీడు ఎవర్ని పెళ్ళి చెసుకుంటాడొ గానీ ఆమె చాలా లక్కీ ఫెలో అంటాను.." అన్నాడు.

కాఫీ వచ్చింది. తాగుతున్నారు. అర్చన మౌనంగా వింటొంది. ఇదంతా ఎందుకు చెబుతున్నాడో అర్థం అయీ, కాకుండా ఉంది.

"మీ అమ్మగారితో మాట్లాడుతాను. ఇంకా ఎంతకాలం ఇలా వీడి గురించి పట్టించుకొకుండా ఉంటారని అడుగుతాను.." అని సుధీర్ ఇంక అర్చన వైపు చూస్తూ అన్నాడు " వీళ్ళది మొదటి నుంచీ బాగా ఉన్న వాళ్ళ ఫామిలీ. అయినా వీళ్ళ ఇంట్లొ ఎవరికీ గర్వం లేదు. ముఖ్యంగా అత్తయ్య గారు, అదే వీళ్ళ అమ్మ గారు ఎంత మంచి మనిషొ చెప్పటానికి వీల్లేదు. మీ లాంటి చక్కని అమ్మాయిని చూపించానంటే ఎంతొ సంతొషిస్తుంది. ,,,"

"స్టాపిట్ ఐ సే ,,," అన్నాడు రాజేష్.

అర్చన రూంలో నుంచి బయటికి వచ్చేసింది. అతను అనాలోచితంగానే ఈ మాటలు అన్నాడా, లేక రాజేష్ అతని చేత ఈ మాటలు అనిపిస్తున్నాడా అన్న సందేహం వచ్చింది.

ఆమెకు రాజేష్ మీద ఇష్టం ఉన్నది. ఈ మధ్య అతను చనువు తీసుకుంటున్నమాట కూడా నిజమే. అందుకు తను అభ్యంతరం చెప్పని మాట కూడా నిజమే. కానీ అతని మనసులొ ఎమన్నా ఉంటే తనే సూటిగా చెబితే బావుంటుంది గానీ ఈ రాయబారాలేమిటి ? ఎన్నొ విషయాలు

తెలిసిన రాజేష్ కు ఈ చిన్న విషయం తెలియలేదంటే అశ్చర్యమే మరి.

అర్చన మనసులో అందోళన మొదలయింది. ఒకపక్క ఎందుకో చెప్పలేని సంతోషం. మరో పక్క ఇది జరిగే అవకాశం లేదన్న భయం.,,, ఆందొళన...

రాజేష్ అభిప్రాయం ఏమిటో స్పష్టంగా తెలియటం లేదు. నోటితో చెప్పకుండానే తన ఉద్దేశ్యాన్ని ఇలా తెలియజేస్తున్నాడా?

సాయంత్రం అయిదు గంటలు కావస్తుండగా రాజేష్ ఆమెను పిల్చాడు. వెళ్ళి ఎదురుగా కూర్చుంది.

"సారీ అర్చనా, ఇందాక వాడేదో అతిగా మాట్లాడాడు. వాడి మాటలేమీ పట్టించుకొకు" అన్నాడు.

"నాకేమనిపిస్తున్నదంటే మీరే చెప్పాలనుకున్నది చెప్పలేక అతనిచేత చెప్పిస్తున్నారని...రోజూ మీకు ఎదురుగా ఎన్నో గంటలసేపు ఒంటరిగా కూర్చుంటున్నాను. మీరు ఏమి చెప్పినా వింటున్నాను. చనువు ఉంది. ఇంకా మనమధ్య రాయబారాలు అవసరమంటారా ?" అని అడిగింది.

"అవసరం లేదు గానీ ఇక్కడ మనం కల్సి పని చేస్తున్నాం. మన వ్యక్తిగత కోరికలూ, అభిప్రాయాలూ సవా లక్ష ఉండొచ్చు. అవన్నీ జరిగితీరాలన్న రూలేమీ లేదు. నేనేదొ తొందరపడి అనటం, నువ్వు బాధపడటం ...ఇది చాలా డెలికేట్ విషయం...." అన్నాడు,

" ఇందులో బాధపడటానికేముంది ? మీరే అన్నారు గదా మనం సవాలక్ష అనుకుంటాం అవన్నీ జరిగితీరాలన్న రూలేమీ లేదని....." అని ఆగి పోయింది.

"ఎప్పుడన్నా ఒకసారి మా ఇంటికి తీసుకెళ్తాను. మా అమ్మకు పరిచయం చేస్తాను. ఆమె మొదట్లొ ఏదీ ఒప్పుకోదు. కానీ చివరకు నేను అడిగింది ఏదీ కాదనదు. గమ్మత్తు అయిన మనస్తత్వం. ... నువ్వే చూస్తావుగా..." అన్నాడు రాజేష్.

ఇంతలో జనరల్ మేనేజర్ దగ్గర నుంచి పిలుపు వచ్చింది. రాజేష్ అయన దగ్గరకు వెళ్ళిపోయాడు.

అర్చన మనసు అనంద తరంగాలమీద తేలియాడుతొంది. ఇంక ఇంటికి బయల్దేరింది.

హ్యాండు బ్యాగ్ చంకకు తగిలించుకుంది. బయటకు నడిచింది. బస్సులో ప్రయాణం చేస్తున్నంత సేపు ఎవరెవరో ఏమేమో అంటున్నా అవేమీ ఆమెకు వినిపించటంలేదు.

ఇంటికి వెళ్ళి తల్లిని కావలించుకుంది. అనందంతో 'అమ్మా' అని అరిచింది. గాలిలో తేలిపోతూ అనంద పారవశ్యంతో మునిగిపోయిన కూతుర్ని చూసి 'ఏమిటే?' అన్నదామె.

తల్లితో ఏదో చెప్పాలని నోటి దాకా వచ్చిన మాటలు పెదవి దాటి బయటకు రాలేదు.

ఇంత అనందాతిశయనం లోను మరో పక్క దిగులుగా వుంది. తండ్రి ఇంటి మొహం చూడటం లేదు. ఆయన ఎక్కడున్నాడని రేపు రాజేష్ అడిగితే ఏమని చెబుతుంది ? తండ్రి గుర్తుకు రాగానే అర్చన మనసులోని సంతొషం అంతా ఆవిరై పోయింది. నిట్టూర్పులే మిగిలాయి.

మర్నాడు అర్చన ఆఫీసులొ తలవంచుకుని పని చేస్తున్నప్పుడు ఆమె తండ్రి పతంజలి వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. ఆయన్ని చూసి అర్చన నివ్వెర పోయింది.

"కూర్చొ" అన్నది కొంచెం తేరుకున్న తరువాత.

"ఏమిటి ఇక్కడకి వచ్చావు /" అని అడిగింది పక్కన కూర్చున్న తండ్రిని.

"ఏమ్ లేదు. నిన్ను చూడాలనిపించింది. వచ్చాను." అన్నాడు ముక్తసరిగా.

"పెళ్ళాం పిల్లల్ని చూసుకొవాలనుకునే వాళ్ళు రొజూ ఇంటికి వచ్చి వాళ్ళతో కల్సి ఉంటూ వాళ్ళ కష్ట సుఖాల్లొ పాలు పంచుకుంటారు. ఇలా ఆఫీసుల్లొను, బస్సుల్లోను పెళ్ళాం పిల్లల్ని చూసి వెళ్ళి పొయే వాడిని ఈ ప్రపంచం లొ నువ్వొక్కడివే ఉన్నావనుకుంటాను...." అన్నది అర్చన.

"నేను ఇంటికి రాని మాట నిజమే. అందుకు కొన్ని కారణాలున్నయి. ... నీతో ఇప్పుడు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చాను.,,," అన్నాడు.

"నువు చెప్పే ప్రతి విషయమూ నాకు ముఖ్యమైనదే. ఎందుకంటే అది నా జీవితం మీద దెబ్బ కొట్టేదే అయి వుంటుంది గనుక..." అన్నది అర్చన.

"కొంచెం మంచి నీళ్ళు ఇస్తావా ? " అని అడిగాడు.

అర్చన మంచి నీళ్ళు ఇచ్చింది. గొంతు తడుపుకున్న తరువాత దూరంగా చూస్తూ తనలో తాను గొణుగుకుంటున్నట్లు చెప్పాడు. "ఇప్పుదు నేను కొన్ని ముఖ్యమైన సమస్యల్లో చిక్కు కున్నాను. .."

"నీవు సమస్యల్లో చిక్కుకోని దెప్పుడు ? మమ్మల్ని సమస్యల సుడిగుండం లోకి నెట్టని దెప్పుడు ?" అన్నది అర్చన.

"నన్ను చెప్పనివ్వు... నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది..." అని ఆగి పోయాడు.

"నీకు భార్య బ్రతికే ఉంది. పెళ్ళికి ఎదిగిన కూతురూ వుంది. భార్యాబిడ్డలు సలక్షణంగా ఉండగా మరొక పెళ్ళి చేసుకొవాల్సి వచ్చిందని చెప్పటానికి నీకు సిగ్గు లేక పొయినా, వినటానికి నాకు సిగ్గుగా ఉంది... భార్య బ్రతికి ఉండగా ఆమెకు విడాకులు ఇవ్వకుండా మరో పెళ్ళి చేసుకొవటం నేరం అని తెలియదా ?" అని అడిగింది అర్చన.

"ఇది నేరం అయినా, నువ్వు పోలీసులకు ఫోను చేసినా ఈ పెళ్ళి ఆగదు. జరిగి తీరుతుంది. ఈ ప్రపంచం లొ ఏ శక్తీ దాన్ని ఆపలేదు..." అన్నాడాయన ధ్రుఢంగా.

"నువ్వు నా తండ్రివని చెప్పుకొవటానికే తల కొట్టేసినట్లు ఉంది...."

"సిగ్గులూ, అభిమానాలూ, మానాలూ ఇవన్నీ పట్టుకుని కూర్చుంటే సుఖంగా బతక లేము..." అన్నాడు పతంజలి.

"ఈ సంగతి చెప్పటానికేనా ఇంత దూరం వచ్చావు. వెళ్ళు. మమ్మల్ని పట్టించుకొకుండా వదిలేశాక నువు ఏమ్ చేసుకుంటే మాకెందుకు ? మాకు చెప్పాల్సిన అవసరం ఏముంది ? వెళ్ళు, వెళ్ళి రొజుకో పెళ్ళి చేసుకుని, పూల దండలు వేసుకుని ఊరేగు...వెళ్ళు...నాకు పని ఉంది.." అన్నది ఆవేశంగా.

అప్పటికే ఇద్దరు ముగ్గురు కొలీగ్స్ వీళ్ళ వంక ఆసక్తిగా చూడటం గమనించింది.

"వెళ్తున్నాను. ఇంతకీ నేను చెప్పదల్చుకున్న దేమిటంటే క్వార్టర్ నా పేరు మీద ఉంది. వారం రొజుల లోపల మీరు దాన్ని ఖాళీ చెయ్యాలి...." అన్నాడు పతంజలి.

“మేము ఖాళీ చెయ్యము. మాకు అక్కడ ఉండే హక్కు వుంది. ఏమ్ చేస్తావో చేసుకో..." అన్నది అర్చన కోపంగా.

"మర్యాదగా ఖాళీ చెయ్యకపోతే మెడ పెట్టి బయటకు గెంటేస్తాను.. నా సంగతి నీకు తెలియదు.,," అన్నాడు పతంజలి.

"ఎలా గెంటేస్తావో నేనూ చూస్తాను..." అన్నది అర్చన.

పతంజలి రొషంగా వెళ్ళి పోయాడు.

అర్చన దుఖాన్ని పంటి బిగువున దాచుకుంటొంది. కన్నీరు తుడుచుకుంటూ బాత్రూం లోకి పరుగెత్తింది.

ఆ సాయంత్రం రాజేష్ అన్నాడు "ఇవాళ సాయంత్రం నిన్ను మా ఇంటికి తీసుకు వెళ్తాను...వస్తావా ?"

"సారీ... నేను రాలేను..."

"ఎందుకని ?"

"మనం సవాలక్ష అనుకుంటాం. అవన్నీ జరగాలని రూలేమీ లేదుగా..."

"నా మాట నాకే అప్పగిస్తున్నావా ?"

"అలా అని కాదు, అందులో ఎంతో నిజం ఉంది..."

"నీ మూడ్ బాగున్నట్లు లేదు... ఇంకో రొజు వెళదాములే..." అన్నాడు రాజేష్.

ఇంటికి వెళ్ళి తల్లి భుజం మీదకు ఒరిగి పోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏమిటే, నిన్న ఏమొ గాలిలో తేలిపోతూ వచ్చావు...ఇవ్వాళేమొ నీలో నువ్వే కుమిలి పోతున్నావు. ఏం జరిగిందే ? " అని అడిగింది ఆమె.

"ఏమ్ లేదులే..." అన్నది అర్చన కన్నీరు తుడుచుకుంటూ.

మనసు మూగది. నిన్న ఏమీ చెప్పలేక పోయింది. ఇవాళా ఏమీ చెప్ప లేక పోయింది.

★★★

(వచ్చేనెల మరో కథ)